ప్రజా సంక్షేమమే ప్రథమ లక్ష్యం



రమేశ్‌బాబుకి ఎల్వోసీ అందజేస్తున్న ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ

శేరిలింగంపల్లి, మే 18 : ప్రజా సంక్షేమమే ప్రథమ లక్ష్యంగా పనిచేస్తున్నామని శేరిలింగంపల్లి ఎమ్మెల్యే అరెకపూడి గాంధీ అన్నారు. హాఫీజ్‌పేట్ డివిజన్ గంగారం ప్రాంతానికి చెందిన కొండపర్తి రమేశ్‌బాబు అత్యవసర వైద్యచికిత్స నిమిత్తం ముఖ్యమంత్రి సహాయనిధికి దరఖాస్తు చేసుకున్నాడు. మంజూరైన రూ. 2 లక్షల ఎల్వోసీని బాధిత కుటుంబానికి శనివారం కార్పొరేటర్ మాధవరం రంగారావుతో కలిసి ఎమ్మెల్యే అందజేశారు. ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ముఖ్యమంత్రి సహాయ నిధి ఆపదలో ఉన్న వారికి ఆపన్నహస్తంలా ఆదుకుంటుందన్నారు. అనారోగ్య సమస్యలతో బాధపడుతూ వైద్యసేవలకు ఆర్థికస్థోమత లేని వారికి సీఎం సహాయ నిధి ఓ వరంలా పనిచేస్తుందని తెలిపారు. కార్యక్రమంలో బీఆర్ఎస్ నాయకులు శ్రీనివాస్ యాదవ్ పాల్గొన్నారు.

వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద అప్రమత్తంగా ఉండాలి

సమీక్షా సమావేశంలో జడ్సీ స్నేహా శబరీష్

శేరిలింగంపల్లిలోని వెస్ట్‌జోన్ కార్యాలయంలో అధికారులతో సమీక్షా సమావేశంలో మాట్లాడుతున్న జోనల్ కమిషనర్ స్నేహా శబరీష్

శేరిలింగంపల్లి, మే 18 : వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద వర్షపునీరు నిలువకుండా అవసరమైన చర్యలు చేపట్టాలని, ప్రత్యేక బృందాలను అందుబాటులో ఉంచాలని జీహెచ్ ఎంసీ వెస్ట్‌జోన్ కమిషనర్ స్నేహా శబరీష్ అన్నారు. శనివారం శేరిలింగంపల్లిలోని వెస్ట్‌జోన్ కార్యాలయంలో వివిధ ప్రభుత్వ శాఖల అధికారులతో ఆమె సమీక్షా సమావేశం నిర్వహించారు. మాదాపూర్, గచ్చిబౌలి, నానక్‌రాంగూడ ఫైనాన్షియల్ డిస్ట్రిక్, నాలెడ్జిసిటీ లాంటి ఐటీ కారిడార్ ప్రధాన ప్రాంతాలతో పాటు అన్ని ప్రధాన రహదారులు, కూడళ్లలో వర్షపునీరు నిలువకుండా జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

కూకట్‌పల్లి జోన్ ఆఫీస్‌లో సమావేశంలో మాట్లాడుతున్న జడ్సీ అభిలాష

అత్యవసర బృందాలు సిద్ధంగా ఉండాలి..

సర్కిళ్ల వారీగా జీహెచ్ఎంసీ ప్రత్యేక అత్యవసర బృందాలను వాటర్ లాగింగ్ పాయింట్ల వద్ద సిద్ధంగా ఉంచాలన్నారు. రహదారులపై నీరు నిండి వాహనదారులకు ఇబ్బందులు తలెత్తకుండా చూడాలని, జీహెచ్ఎంసీ ప్రత్యేక బృందాలు, ట్రాఫిక్ పోలీసులు సమన్వయంతో సమస్య పరిష్కారానికి చర్యలు తీసుకోవాలని పేర్కొన్నారు. సంబంధిత అధికారులు రహదారులు, వివిధ కూడళ్ల మధ్యలో అడ్డుగా ఉన్న విద్యుత్ స్తంభాలు, చెట్లు తొలగించేందుకు చర్యలు చేపట్టాలని తెలిపారు. సమీక్షా సమావేశంలో వెస్ట్‌జోన్ డిప్యూటీ కమిషనర్ వేణుగోపాల్ రెడ్డి, శేరిలింగంపల్లి ఉపకమిషనర్ రజనీకాంత్ రెడ్డి, చందానగర్ ఉపకమిషనర్ వంశీకృష్ణతో పాటు యూసుఫ్‌గూడ, పటాన్‌చెరువు, ఆర్సీపురం సర్కిళ్ల ఉపకమిషనర్లు, జీహెచ్ఎంసీ ఇంజనీరింగ్, శానిటేషన్ విభాగాల అధికారులు, విద్యుత్ శాఖ, ట్రాఫిక్, లాండ్ ఆర్డర్ పోలీసు అధికారులు, రెవెన్యూ, జల మండలి అధికారులు పాల్గొన్నారు.

విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోవాలి

కేపీహెచ్‌బీ కాలనీ, మే 18 : వర్షాకాలం విపత్తులను సమర్థవంతంగా ఎదుర్కోనేందుకు యంత్రాంగం సిద్ధంగా ఉండాలని కూకట్‌పల్లి జోనల్ కమిషనర్ అభిలాష అన్నారు. శనివారం జోన్ కార్యాలయంలో జీహెచ్ఎంసీ, ఆర్టీసీ, జలమండలి, విద్యుత్, సీఎంఆర్ ఏజెన్సీ, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ విభాగాలతో కలిసి కన్వర్జెన్సీ మీటింగ్‌ను నిర్వహించారు. జడ్సీ మాట్లాడుతూ.. జోన్ పరిధిలోని ఐదు సర్కిళ్లలో రోడ్లు, జంక్షన్ల అభివృద్ధిపై దృష్టి సారించాలని, ఇప్పటికే మరమ్మతులు చేసిన జంక్షన్లలో తాత్కాలిక నిర్మాణాలను తొలగించాలని అన్నారు. శాశ్వత నిర్మాణాలను తొలగించేందుకు భవన యజమానులకు నోటీసులు జారీ చేయాలన్నారు. వర్షాకాలం నేపథ్యంలో సమస్యాత్మక ముంపు ప్రాంతాలను గుర్తించి ముందస్తు చర్యలు తీసుకోవాలన్నారు. ప్రధాన రోడ్లపై నీరు నిల్వకుండా చూడాలని, వరద ముంపు సమస్యలపై అప్రమత్తంగా ఉండాలన్నారు. రోడ్ల ప్రక్కన సమస్యాత్మకంగా ఉన్నటువంటి విద్యుత్ స్తంభాలను తొలగించాలన్నారు. ఫుట్‌పాత్ ఆక్రమణలపై చర్యలు తీసుకోవాలన్నారు. రోడ్డు ప్రక్కన కేటాయించిన స్థలంలోనే ఆర్టీసీ బస్సులను నిలపాలన్నారు. ఆయా విభాగాల అధికారులు సమన్వయంతో పనిచేసి ప్రజలకు ఇబ్బందులు లేకుండా చూడాలన్నారు. కార్యక్రమంలో ఎస్ఈ, ఈఈలు, డీసీలు, ఏఎంహెచ్‌లు, జలమండలి, విద్యుత్, ట్రాఫిక్, లా అండ్ ఆర్డర్ పోలీసులు, పలువురు అధికారులు పాల్గొన్నారు.

ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి

కొలన్ శ్రీనివాస్‌రెడ్డికి సమస్యలు విన్నవిస్తున్న వివిధ కాలనీల నాయకులు

దుండిగల్, మే 18 : ప్రజాసమస్యల పరిష్కారానికి కృషి చేస్తానని కాంగ్రెస్ రాష్ట్ర నాయకులు కొలన్ శ్రీనివాస్‌రెడ్డి (కేఎస్ఆర్) అన్నారు. నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ (ఎన్ఎంసీ) పరిధిలోని వివిధ డివిజన్ల నాయకులు, కార్యకర్తలు, వివిధ కాలనీలు, బస్తీల ప్రజలు శనివారం కేఎస్ఆర్ నివాసంలో ఆయనను మర్యాదపూర్వకంగా కలిశారు. కాలనీలు, బస్తీల్లో నెలకొన్న సమస్యలను పరిష్కరించాలని కోరారు. సానుకూలంగా స్పందించిన శ్రీనివాస్‌రెడ్డి సమస్యల పరిష్కారమే ధ్యేయంగా ప్రజలకు అందుబాటులో ఉంటూ పనిచేస్తున్నట్లు తెలిపారు. సంబంధిత అధికారులతో వెంటనే మాట్లాడి ఆయా ప్రాంతాల్లోని సమస్యలు పరిష్కరించాలని సూచించారు.

అల్లాపూర్ డివిజన్‌కు చెందిన బీజేపీ మేడ్చల్ జిల్లా ఉపాధ్యక్షుడు పులిగొల్ల శ్రీనివాస్ యాదవ్ పార్టీ శ్రేణులతో కలిసి శనివారం మాల్కాజ్‌గిరి ఎంపీ అభ్యర్థి ఈటల రాజేందర్‌ను ఆయన నివాసంలో మర్యాదపూర్వకంగా కలిశారు.

- అల్లాపూర్

'ఈటల' ను కలిసిన నిజాంపేట్ కార్పొరేషన్ నాయకులు

మల్కాజ్‌గిరి బీజేపీ ఎంపీ అభ్యర్థిగా పోటీ చేసిన ఈటల రాజేందర్‌ను కుత్బుల్లాపూర్ నియోజకవర్గం, నిజాంపేట్ మున్సిపల్ కార్పొరేషన్ పరిధిలోని నిజాంపేట, ప్రగతినగర్, బాచుపల్లికి చెందిన 40మంది బీజేపీ నాయకులు శనివారం వారి నివాసంలో కలిశారు. డాక్టర్ ఎం.ఆర్.ఎస్. రాజు ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో నిజాంపేట్ కార్పొరేషన్ బీజేపీ ప్రధాన కార్యదర్శి వై.చెన్నారెడ్డి, కార్యదర్శి అజయ్ కుమార్‌రెడ్డి, సీనియర్ నాయకులు సుబ్బారావు, శిల్పా రెడ్డి, మైలారం అశోక్, గోపతి సురేశ్, కృష్ణా రెడ్డి, శివప్రసాద్, సీతామంథన్, రఘునాథ రెడ్డి, డాక్టర్ శివనాగ కేశవరెడ్డి, వీరేశ్, అనూష పాల్గొన్నారు.

- దుండిగల్

ఘనంగా వాసవీ కన్యకాపరమేశ్వరి జయంతి

కుత్బుల్లాపూర్ : అన్నదానం చేస్తున్న ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ సభ్యులు



కేపీహెచ్‌బీ కాలనీలో.. వాసవీ అమ్మవారి జయంతి వేడుకల్లో పూజలు చేస్తున్న భక్తులు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 18 : కేపీహెచ్‌బీ కాలనీ 3వ ఫేజ్‌లోని శ్రీ వాసవీ కన్యకాపరమేశ్వరి ఆలయ అష్టాదశ (18) వార్షికోత్సవాలు వైభవంగా జరిగాయి. మూడు రోజుల పాటు పూజలు చేశారు. శనివారం వాసవి అమ్మవారి జయంతి సందర్భంగా అభిషేకం, విశేష అలంకరణ, శ్రీ మధుసూదనానంద సరస్వతీ అనుగ్రహ భాషణం, మహాపూర్ణాహుతి పూజలు చేశారు. భక్తులకు అన్నదాన కార్యక్రమాన్ని చేపట్టారు. వేడుకల్లో ఆలయ కమిటీ చైర్మన్ చెరుకు కుమారస్వామి, ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.

కుత్బుల్లాపూర్ : వాసవీ మాత జయంతి ఉత్సవాలను కొంపల్లి ఆర్యవైశ్య వెల్ఫేర్ అసోసియేషన్ ఆధ్వర్యంలో జీడిమెట్ల గాంధీవిగ్రహం వద్ద నిర్వహించారు. వాసవీ మాత చిత్రపటానికి పూలదండ వేసి పూజలు చేసి.. 500 మందికి అన్నదానం చేశారు. కార్యక్రమంలో వెల్ఫేర్ కమిటీ సభ్యులు పడకంటి వెంకటేశం, పార్శి నాగేందర్, చీల రాము, జూటురు లక్ష్మణ్, గ్రంధి సుబ్రహ్మణ్యం, తాటి పాముల రమేశ్, మామిడి శ్రీనివాస్, పార్శి వేణు, గజవాడ బాలవీరయ్య పాల్గొన్నారు.

జగద్గిరిగుట్టలో వేడుకగా..

జగద్గిరిగుట్ట : వాసవీకన్యకా పరమేశ్వరి సంతోషం, సంక్షేమం పంచాలని ఆర్యవైశ్య సంఘం ప్రతినిధులు ఆకాంక్షించారు. జగద్గిరిగుట్టలో శనివారం అమ్మవారి జయంతి వేడుకలు జరిపారు. ప్రత్యేకంగా అలంకరించిన వాసవీ విగ్రహానికి విశేష పూజలు, కుంకుమార్చన, ఒడిబియ్యం సమర్పించి అన్నదానం చేశారు. కార్పొరేటర్ జగన్, సంఘం నాయకులు పార్శి ప్రకాశ్‌గుప్త, తేరాల శ్రీనివాస్, కృష్ణమూర్తిగుప్త పాల్గొన్నారు.

బాలానగర్ , మే 18 : కన్యకాపరమేశ్వరి జయంతి వేడుకలు వైభవంగా జరిగాయి. శనివారం ఫతేనగర్‌లోని శ్రీకన్యకాపరమేశ్వరి ఆలయంలో ఆలయ కమిటీ సభ్యులు రామయోగి గుప్త, వీరేశం గుప్త, నాగేశ్ గుప్త, వాసు గుప్త పర్యవేక్షణలో నిర్వహించిన అమ్మవారి జయంతి వేడుకలకు కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ హాజరయ్యారు. ఈ సందర్భంగా అమ్మవారికి ఆయన పూజలు చేశారు

జగద్గిరిగుట్టలో .. కుంకుమార్చనలో పూజలు చేస్తున్న మహిళలు

బాలానగర్ : అమ్మవారి జయంతి వేడుకల్లో పాల్గొన్న కార్పొరేటర్ సతీశ్‌గౌడ్

శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయ వార్షికోత్సవం

కేపీహెచ్‌బీ కాలనీ, మే 18 : కేపీహెచ్‌బీ కాలనీ 6వ ఫేజ్‌లోని శ్రీఉమారామలింగేశ్వరస్వామి ఆలయ ద్వితీయ వార్షిక బ్రహ్మోత్సవాలు ప్రారంభమయ్యాయి. ఆలయ నిర్మాణ దాత, కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు, శైలజ దంపతుల ఆధ్వర్యంలో శనివారం ఉదయం విజయ గణపతి స్వామివారికి విశేష అభిషేకం, లక్ష గరిక పూజ చేశారు. శ్రీ లక్ష్మీ గణపతి హోమం, కాశీ పండితుల వారి పర్యవేక్షణలో స్వామి వారికి సప్త ఋషి హారతి, నీరాజన మంత్ర పుష్ప పూజలు జరిగాయి. కార్పొరేటర్ మందడి శ్రీనివాస్‌రావు దంపతులతో పాటు కుటుంబ సభ్యులు పాల్గొని పూజలు చేశారు.

నేడు శాంతి కల్యాణం..

బ్రహ్మోత్సవాల్లో భాగంగా నేడు స్వామివారికి శాంతి కల్యాణం నిర్వహించనున్నారు. ఉదయం మహాన్యాస పూర్వక ఏకాదశ రుద్రాభిషేకం, రుద్ర హోమం, గణపతి పూజ, పుణ్యాహవచనం, పంచగవ్యం పూజలు చేయనున్నారు. వేడుకల్లో కూకట్‌పల్లి ఎమ్మెల్యే మాధవరం కృష్ణారావు, ముఖ్యనాయకులు పాల్గొని... పూజలు చేయనున్నారు. కాలనీవాసులు అధిక సంఖ్యలో పాల్గొని స్వామివారి కృపకు పాత్రులు కావాలని ఆలయ కమిటీ సభ్యులు కోరారు.

పూజల్లో.. కార్పొరేటర్ శ్రీనివాస్‌రావు దంపతులు

కూకట్‌పల్లి రైతుబజార్‌లో కూరగాయల ధరలు

కేపీహెచ్‌బీ కాలనీ, మే 18 : కూకట్‌పల్లి (కేపీహెచ్‌బీ కాలనీ) రైతుబజార్‌లో శనివారం కూరగాయల ధరలు (కేజీ – రూపాయలు) టమాట 19, వంకాయ 23, బెండ 40, పచ్చిమిర్చి 50, బజ్జి మిర్చి 45, కాకరకాయ 35, బీరకాయ 35, క్యాబేజీ 18, ఫ్రెంచ్ బీన్స్ 95, క్యారెట్ 35, కాలీఫ్లవర్ 18, దొండ 33, చిక్కుడు 65, గోరుచిక్కుడు 35, బీట్‌రూట్ 17, క్యాప్సికం 60, ఆలుగడ్డ 28, కీరా 18, దోసకాయ 23, సొరకాయ11, పొట్లకాయ (1) 18, కందగడ్డ 75, ఉల్లిపొరక 55, ఉల్లిగడ్డ 20, మామిడికాయ(1) 10 నుంచి 15, అరటికాయ(1) 7 నుంచి 8, చామగడ్డ 45, ముళ్లంగి (1) 4 నుంచి 5, మొరంగడ్డ 35, గుమ్మడికాయ 35, నిమ్మకాయలు(12) 65 నుంచి 75, మునగకాయ(1) 4 నుంచి 5, పొప్పడికాయ 40, పుట్టగొడుగులు (200గ్రా.) 40, ఎండుమిర్చి 220, అల్లం 180, వెల్లుల్లి 240, చింతపండు 120, పండుమిర్చి 80 గా ఉన్నాయి. ఈ ధరలు నేటి ఉదయం 9 : 30 గంటల వరకు అమలులో ఉంటాయని ఎస్టేట్ ఆఫీసర్ సుధాకర్ తెలిపారు.

ముంపు సమస్యకు సత్వర పరిష్కారం

బాలానగర్ , మే 18 :ఫతేనగర్ డివిజన్ పరిధిలోని చేపల మార్కెట్ సమీపంలో ముంపు సమస్యను పరిష్కరించనున్నట్లు కార్పొరేటర్ సతీశ్‌గౌడ్ పేర్కొన్నారు. స్థానికుల విజ్ఞప్తి మేరకు ఆయా ప్రాంతాల్లో పర్యటించి ముంపును పరిశీలించినట్లు తెలిపారు. సదరు ప్రాంతం లోతట్టుగా ఉండడం వలన వర్షాకాలంలో వరదనీరు వచ్చి చేరుతుందన్నారు. రోడ్డును మరింత ఎత్తుకు పెంచి ముంపును పరిష్కరించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో కుక్కల రాజేశ్వర్, మురళీముదిరాజ్, అశోక్ గౌడ్ పాల్గొన్నారు.

బాచుపల్లి విలేజ్‌లో విజేత సూపర్ మార్కెట్ 111వ శాఖ ప్రారంభమైనది. పి.తిరుపతిరెడ్డి ప్రారంభించగా.. విజేత సూపర్ మార్కెట్ మేనేజింగ్ డైరెక్టర్ ఎం.జగన్మోహన్ రావు, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ ఎం.సందీప్ చౌదరి, సిబ్బంది పాల్గొన్నారు.

వీరబ్రహ్మేంద్రస్వామి ఆరాధనోత్సవాలు

బాలానగర్ , మే 18 : పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆరాధన మహోత్సవం, ఓల్డ్‌బోయిన్‌పల్లి ఆలయం ప్రథమ వార్షికోత్సవం సందర్భంగా శనివారం భవానీనగర్‌లోని పోతులూరి వీరబ్రహ్మేంద్రస్వామి వారి ఆలయంలో కార్పొరేటర్ ముద్దం నర్సింహ యాదవ్ పూజలు చేశారు. ఆలయ కమిటీ సభ్యులు పాల్గొన్నారు.